

# ఆకాశవాణి

## సంగీత సమీక్ష...

"పరుసవేది"

మంగళవారం, 6-2-51

### షేక్ కబీరు సాహెబ్‌గారి వైలిను వాద్యం

అత్యంత సాధకశక్తి ప్రదర్శిస్తూ, సుస్వరయుక్తమైన చక్కని ధారతో వాయించారు. గమకయుక్తమైన బాణీలో నున్న రక్తి పాడి స్వరవాద్యంలో ఉండదు. పాప వెంకట్రామయ్యరుగారి ఫక్కీ ననుసరించడానికి తీవ్రమైన కృషిచేస్తే గమకబాణీ అలవాటవుతుంది. ఏదో ఒక బాణీలో బాగుందని అనిపించుకున్న ప్రతీ జంత్ర విద్వాంసుడూ కర్ణాటకశైలిలో నున్న సొగసులు అలవర్చుకుని ప్రచారం చెయ్యాలి.

### జి కె. సుబ్రహ్మణ్యంగారి పాట

శైలి, జ్ఞానం, ప్రదర్శనాశక్తి చక్కని మార్గంలో ఉన్నాయి. జన్యరాగాలు ఆలాపన చేసేటప్పుడు మూర్ఛనాదోషాలు రాకుండా చూచుకోవాలి. మాళవగౌళరాగం బాగుంది.

బుధవారం, 7- -51

### పాలపర్తి గోపాలకృష్ణమూర్తిగారి గానం

త్యాగరాజాది సుప్రసిద్ధ వాగ్గేయకారులు కీర్తనలు రచించినప్పుడే వారు పాటే పదసమూహాన్ని అద్వితీయమైన భావంతో పాకంపట్టి గానం చేసి రచియిస్తారు ఆ కీర్తన ఆ రాగంలోని రాగమర్యాదలు పాటిస్తూ గానంచేస్తే భావపూరితముగానే వుంటుంది. "భావం" కోసము ఆధునికయువకులు కృతులలోని మాటలను సాగదీసి ఒకమార్గం అంటూ లేకుండా స్వయంగా కల్పించిన చిట్టాలతో గానం చెయ్యనక్కరలేదు. గాయకునకు రాగభావంతోనే పని. మాటలలోని భావం ప్రదర్శనం చెయ్యడం పౌరాణికుని పని. హరిదాసు పని, కృతులలోని మాటలను స్ఫుటంగా, లలితంగా ఉచ్చరిస్తూ రాగభావము కాపాడుకుంటూ సంప్రదాయసిద్ధమైన ఒక చిట్టా ననుసరించి గానంచేస్తే అదే పదివేలు. భావం వెంటావస్తుంది.

గురువారం, 8-2 51

### యామర్తి వరలక్ష్మిగారి గానం

బాగా చొరవచేసి పురుషులవలె గానంచేసే గాయనీమణులలో ఈమె యొకరు. గాత్రం సన్నం చెయ్యకుండా ప్రతీసంగతీ బరువుగా పలకరిస్తే ఈమెగానం రసవంతంగా వుంటుంది. పలకవలసినంత దురితకాలములో వర్ణం తానజాతి ఆకారముతో సాధకముచేస్తే పలుకు బరువుగా వస్తుంది. స్వరకల్పనలో ముఖ్యముగా సర్వలఘు కల్పన కొఱకై ఈమె ప్రయత్నించాలి.

బుధవారం 14-2-51

### శిష్టు ప్రభాకర కృష్ణమూర్తిగారి గానం

వీరి కీర్తన లయశుద్ధముగా బాగుంది. రాగము, నెరవుకొఱకై తీవ్రమైనకృషి చెయ్యవలసి వుంటుంది వీరు. స్వరకల్పనను వర్ణములలోని స్వరపోకడల మార్గమున నడపడానికి కృషి చెయ్యాలి, రవ్వసంగతులు ఎక్కువగా పలికిస్తూ

ఉంటే గాత్రపాటకు జీవం వస్తుంది. కృష్ణమూర్తిగారు అందుకై ప్రయత్నించాలి.

గురువారం, 15-2-51

## దేవరకొండ సీతాలక్ష్మిగారి గానం

స్త్రీ గాత్రములో సంగతులకు సరియైన తూకము కొలతలేకుంటే పాట నిస్సత్తువగా తోస్తుంది. ధ్వని లావు, సన్నమూ చేయకుండా ఏకధారగా నిండు నాదంతో గొంతు పలుకుతూవుంటే నాదపుష్టికి ఏమీ కొఱత కలుగదు. సీతాలక్ష్మిగారీ విషయాలు గమనించాలి మనోధర్మ సంగీతమనగా ఒక పద్ధతికి లోబడి వుండకపోవడం కాదు. జాగ్రత్తగా గమనించిచూస్తే పేరొందిన గాయకుల గానము ఒకేమార్గము ననుసరించి వుంటుంది. ఆ మార్గముకొఱకై ప్రయత్నముచేసి అలవర్చుకోవాలి అభివృద్ధికోరినవారందరూ. మొదటినుండీ మనోవీథుల సంచరిస్తే జ్ఞానం పెంపొందదు పెడదారులు త్రొక్కడానికి అవకాశం కలుగుతుంది.

శనివారం, 17-2-51

## వీ. సూర్యకాంతంగారి వీణాగానం

సంగీతకృషిచేస్తూవున్న ప్రతీవిద్యార్థికీ(విద్యార్థినికీ) రేడియోలో పాడాలనీ, వాయించాలనీ అభిలాషవుండడం సహజమే. కాని అభిలాష మాత్రముండి అందుకు తగిన జ్ఞానం సంపాదించాలనే కుతూహలము లేకపోతే చాలా ప్రమాదం. జంత్రం సాధిస్తున్నప్పుడు వీణ, ఫిడేలు అయితే, తీగలన్నిటినీ నియమితశృతులలో బిగించగలగడం ముందు నేర్చుకోవాలి. విద్య నేర్పుతున్న అయ్యవారు శ్రద్ధవహించి శిష్యులకు జంత్రపుతీగలను శృతిచెయ్యడం నేర్పాలి. శృతిజ్ఞానం కలుగకుండా శిష్యులను రేడియోప్రదర్శనానికి తయారు చెయ్యడం అన్యాయము. సూర్యకాంతంగారి వీణలోని లయమీటే తీగెలు శృతికి దూరమై మొత్తం వాద్యాన్ని బ్రహ్మరాక్షసివలె మింగివేశాయి.

★

# ఎదలోని రొద

కల్లోలపూరిత సంద్రపు ఘోష
కళాపూరిత హృదయానికోభష ..
దొంగతనపు చిన్నెలె దొరమార్గం
దోపిడిముఠాల విలయమే స్వర్గం
వెల్లువలై ప్రవహించే ప్రేమ
ఫెళ్లున వెనుకంజయే ఈ సీమలో
కల్లోలపూరితమైన సీమలో
కొల్లలుగా ఆకలిజీవాలు
వసంతకాలపు కోయిల కువకువ
కరడుకట్టిన నా గుండెకో రవరవ. ..
పేదవానిముందరి పెన్నిధి
పేరులేని నాకీ ప్రేమనిధి ..
కాళరాత్రిలో కూడాకవ్వట్టుతోంది
కటికి ఆకలి కనువిప్పిన దృశ్యం
తుప్పుపట్టిన ఈ నా ఎదలో
తునకలయే గాజులరొదలు ..
నా హృదయపు అంతర్భాగంలో
హమేషా వెలిగించు జీవిత జ్వాల ..

–సజగ్నాధ్

1950 దశకంలో ఆనందవాణి అనే పత్రికలో " ఆకాశవాణి - సంగీత సమీక్ష " శీర్షికతో ప్రచురించబడ్డ వ్యాస పరంపరలోని కొన్ని వ్యాసాలు ఇక్కడ చూడవచ్చు.

ఇలాటివి, మరియు ఆకాశవాణికి సంబంధించిన ఏ చిన్న భాగం అయినా, అది ఆడియో అవ్వొచ్చు, ఫోటో అవ్వొచ్చు, వ్యాసం అవ్వొచ్చు, మరేదైనా అవ్వొచ్చు, అవి మీ వద్ద వుంటే పంచుకోగలరని ఆశిస్తూ....

కాపీరైటు హక్కుల ఉల్లంఘన ఉద్దేశం లేదనీ, లాభాపేక్ష / ధనార్జన ఉద్దేశమంతకన్నా లేదనీ సవినయంగా తెలియచేసుకుంటూ - ఈ వ్యాసాలు ఇక్కడ, ఇలా రేడియో అభిమానులకు అందుబాటులో ఉంచటానికి అభ్యంతరాలు ఎవరికైనా ఉంటే తప్పక తెలియపర్చండి. క్షమాపణలతో వెంటనే తొలగిస్తాను.

భవదీయుడు

మాగంటి వంశీ మోహన్

http://www.maganti.org/